## నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

మరిపెడ/ నర్సింహులపేట/దంతాలపల్లి, మే 29: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి అన్నారు. నూతన విత్తన చట్టం – 2025 ముసాయిదా రూపొందించేందుకు సమావేశాలు గురువారం మరిపెడ, నర్సింహులపేట మండలంలోని పెద్దనాగారం స్టేజీ జీపీ వద్ద, దంతాలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 1966లో ఏర్పాటు చేసిన విత్తన చట్టం అమలులో ఉందని, ఈ చట్టం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. ఈ చట్టం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కొత్త చట్టం అమలులోకి వస్తే రైతులకు నాణ్యమైన వంగడాలు అందుబాటులోకి రావడంతోపాటు నకిలీ విత్తనాల బెడద ఉండదని చెప్పారు. పంట నష్టపరిహారం త్వరగా అందుతుందని వివరించారు. ప్రముఖ న్యాయవాది, రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ సంఘం సభ్యుడు సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముసాయిదా కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సూచనలు, వ్యవసాయ నిపుణుల సలహాలు తీసుకుంటుందని తెలిపారు. మరిపెడలో దొంతి నరసింహరెడ్డి, ఏవో వీరాసింగ్, వెర్మరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మల్లేశ్ యాదవ్, లక్ష్మారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ముదిరెడ్డి గోపాల్‌రెడ్డి, కుడితి వెంకటరెడ్డి, నర్సింహులపేట ఏవో వినయ్ కుమార్, శరత్‌చంద్ర, దంతాలపల్లి ఏవో వాహిని పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతూన్న రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి

## ఘనంగా టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నమస్తే నెట్‌వర్క్, మే 29: జిల్లాలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. టీపీటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి 15శాతం బడ్జెట్ కేటాయిస్తామని, అందులో సగం కూడా కేటాయించ లేదన్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న సమీకృత గురుకులాలు, యంగ్ ఇండియా స్కూళ్లకు పిల్లలను ఎక్కడి నుంచి ప్రవేశాలు తెస్తారో ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీ అంజయ్య, శ్రీశైలం, సువర్ణ, యాదగిరి, విష్ణువర్ధన్, శ్రీనివాస్, జనార్ధన్, జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్, నెల్లికుదురు మండల అధ్యక్షుడు యాకయ్య, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, నవీన్, రాజు, పెద్దవంగర ఎమ్మార్సీలో టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పెండ్లి రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, దేవేందర్, లక్ష్మణ్, మురళి, యుగేందర్, ప్రభాకర్, మరిపెడలో మహ్మద్ హాఫీజర్, హేమ్లానాయక్, విష్ణువర్ధన్ రెడ్డి, ఎం.రవి, బాలాజీ, నర్సింహరావు, కురవిలో జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గుండ్ల విజయ్‌కుమార్, సీరోల్ మండల ప్రధాన కార్యదర్శి సజ్జనపు విద్యాసాగర్, ఓదెల శివకుమార్, గార్లలో వజ్రం నాగేశ్వరావు, శీలంశెట్టి వెంకటేశ్వర్లు, బాలాజీ, కొత్తగూడలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల సాంబయ్య, కొత్తగూడ, గంగారం మండలాల బాధ్యులు తీగల రమేశ్, మేడ నర్సింహారావు, అయిలబోయిన శ్రీకళ, మండల కమిటీ సభ్యులు యాదగిరి, రవి, భరత్, సూర్యనారాయణ, రమేశ్, సాంబయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.



నెల్లికుదురులో టీపీటీఎఫ్ జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

## తొర్రూరులో కంటి వైద్య శిబిరం

తొర్రూరు, మే 29: హైదరాబాద్‌కు చెందిన శంకర్ కంటి ఆస్పత్రి సహకారంతో, ప్రగతి సేవా సమితి, లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం తొర్రూరు లయన్స్ భవనంలో గురువారం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పేదల కోసం ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. లయన్స్ క్లబ్, పీడీజీ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సీహెచ్ నవీన్‌కుమార్, ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకులు గద్దల జాను, క్యాంపు నిర్వహణలో వెంకట్‌రెడ్డి, రేగూరి వెంకన్న, తమ్మి రమేశ్, బోనగిరి శంకర్, ఎం.కోటయ్య, చెడపాక వెంకన్న, వేల్పుగొండ ఉపేందర్, అంజయ్య, సువర్ణ, సంతోష, శ్రీలత, మురళి, అశోక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

NAMASTHE TELANGANA CLASSIFIEDS

**PLOT FOR SALE**

★Hnk గోపాలపూర్ భద్రకాళి కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఈస్ట్ ఫేసింగ్ 300 స్క్వేర్ యార్డ్స్ 30 ఫీట్ల రోడ్డు మంచి వాస్తు క్లియర్ టైటిల్ గల ప్లాటు అమ్మబడును No Brokers cont : 8790501225 and 99499 12347.

NTW-000

**CHANGE OF NAME**

My Name in Old passport MAMIDALA ANNAPOORNA W/o PRAKASH MAMIDALA R/o H. No. 1-9-965, Postal Colony, Hanamkonda 506001, Telangana state, is now changed into MAMIDALA ANNAPURNA W/o MAMIDALA PRAKASH and for all purposes.

NTW-17664

**WANTED**

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.

NT-325336

**CHANGE OF NAME**

★ I, SYED FATIMATUZUHRA (Old Name) R/o H.No. 7-7-214, Ujlibase, Alankar, HanamKonda Dist-506011, T.G, Have Changed my name SYED FATIMATUZUHRA to from SYEDA FATHIMUZZUHARA (New Name) W/o MIRZA AMJADULLAH BAIG for all future purposes.

NTW-6587

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565



## 'కర్ర'ంటు స్తంభం

ఉప్పరగూడెం - నాంచారిమడూర్ రోడ్డులో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

ఓ వ్యవసాయ క్షేత్రంలో కరెంట్ స్తంభం ఓ వైపు పూర్తిగా వంగి ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో సదరు రైతు దానికి ఆసరాగా ఓ కర్రను ఏర్పాటు చేశాడు. పెద్ద వంగర మండలం ఉప్పరగూడెంలో ఉప్పరగూడెం – నాంచారిమడూర్ రోడ్డు పక్కనే ఉండగా విద్యుత్ అధికారులు సరిచేయలేదు. నిత్యం విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సదరు రైతు ఆరోపిస్తున్నాడు.

*– పెద్దవంగర, మే 29*

## విస్తృతంగా విత్తన, ఎరువుల షాపుల తనిఖీలు

నమస్తే నెట్‌వర్క్, మే 29: జిల్లాలో విత్తన, ఎరువుల షాపులను అధికారులు గురువారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. డీలర్ల లైసెన్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. పెద్దవంగర మండలంలో ఏవో స్వామి, తహసీల్దార్ బీ మహేందర్, ఎస్సై క్రాంతి కిరణ్, ఏఈవోలు తనిఖీ చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని కిసాన్ అగ్రిమాల్, బాలాజీ, తెలంగాణ ఆగ్రోస్, శ్రీనివాస రైతు సేవా కేంద్రాలను టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఏవో తిరుపతిరెడ్డి, తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్ రావు పాల్గొన్నారు. ఇనుగుర్తిలో ఏవో భూక్య మహేందర్, కేసముద్రం ఎస్సై మురళీధర్ రాజ్, ఆర్ఐ నరసింహరావు తనిఖీ చేశారు. తొర్రూరు మండలంలోని మన గ్రోమోర్, పద్మావతి ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్ విత్తన దుకాణాల్లో ఏవో అధికారి డీ రామ్ నర్సయ్య, ఎస్సై ఉపేందర్ తనిఖీలు చేశారు. బయ్యారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, గంధంపల్లిలోని మదీనా ట్రేడర్ల ఎరువులు, విత్తన షాపులను తహసీల్దార్ నాగరాజు, ఎస్సై తిరుపతి, ట్రైనీ ఎస్సై మౌనిక, ఏవో రాంజీ నాయక్ తనిఖీ చేపట్టారు. సీరోలు మండలంలో తహసీల్దార్ పూర్ణచందర్, ఏవో టీ చాయారాజ్, ఎస్సై నగేష్, షేక్ ఖాదర్‌పాషా, చిన్నగూడూరులో ఏఓ భాస్కర్, తహసీల్దార్ మహబూబ్‌అలీ పాల్గొన్నారు. ఉగ్గంపల్లి రైతు వేదికలో విత్తన వ్యాపారులకు అవగాహన కల్పించారు.



మహబూబాబాద్ రూరల్: తనిఖీ చేస్తున్న టౌన్ సీఐ దేవేందర్

## విద్యుదాఘాతంతో ఎనిమిది పాడి గేదెలు మృతి

- తీగలు తెగి మూడురోజులైనా పట్టించుకోని అధికారులు
- గేదెల మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణం

ఇనుగుర్తి, మే 29: విద్యుదాఘాతంతో ఎనిమిది పాడి గేదెలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని చిన్నముప్పారంలో గురువారం ఉదయం జరిగింది. బాధిత రైతులు వివరాలప్రకారం.. ఇటీవల బలమైన గాలులు వీచి, భారీ వర్షం కురవగా వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా కోసం వేసిన ఎల్‌టీ లైన్ రైతు కాలేరు ప్రభాకర్ పొలంలో తెగి కింద పడింది. దీనిపై రైతులు గ్రామ విద్యుత్ సిబ్బంది రాజశేఖర్‌కు సమాచారం ఇచ్చారు. కానీ మూడు రోజులు గడుస్తున్నా సరిచేయలేదని, గురువారం ఉదయం ఎనిమిది పాడి గేదెలు మృతిచెందాయని పేర్కొన్నారు. ఒక్కో గేదె సుమారు రూ.70వేలు ఉంటుందని, మొత్తం సుమారు రూ.5.6లక్షల నష్టపోయామని, విద్యుత్ అధికారులు, ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. కాలేరు దేవేందర్‌కు చెందిన రెండు, కాలేరు భాస్కర్, రమేశ్, హరీశ్, శివాజీ, రాజు, రాజశేఖర్‌లకు చెందిన ఒక్కో పాడిగేదె ఉన్నాయి. కాగా, ఎల్‌టీ విద్యుత్ తీగలు తెగి కింద పడిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురానందున కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న అన్‌మ్యాన్డ్ విద్యుత్ సిబ్బంది రాజశేఖర్‌పై చర్యలు తీసుకుంటామని ఏఈ భార్గవి తెలిపారు. పాడి గేదెలు మృతిచెందిన రైతులకు ఎక్స్‌గ్రేషియా అందిస్తామని పేర్కొన్నారు.



విద్యుత్‌షాక్‌తో మృత్యువాత పడిన పాడి గేదెలు

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

డోర్నకల్, మే 29: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిలుక్కొయ్యలపాడులో గురువారం జరిగింది. ఎస్సై ఉమ తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన ఉడుగుల ఉపేందర్(25) హైదరాబాద్‌లో ఎంబీఏ పూర్తి చేసి ఇటీవల ఇంటికి వచ్చాడు. ఈనెల 28వ తేదీన రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి డాబాపై పడుకుంటానని చెప్పి చెప్పి వెళ్లాడు. మృతుడి బాబాయి వీరన్న గురువారం ఉదయం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లగా చింతచెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వీరభద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పల్లె ప్రకృతి వనంలో చోరీ

మహబూబాబాద్ రూరల్, మే 29 : పల్లె ప్రకృతి వనంలో గురువారం చోరీ జరిగింది. రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొమ్ముగూడెం తండాలో ఉన్న పల్లె ప్రకృతి వనంలో బోర్ మోటర్, చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వాటి విలువ రూ.40వేలు ఉంటుంది. జీపీ సెక్రటరీ కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

కురవి, మే 29: మండల కేంద్రానికి చెందిన దుస్స రాంబాబు(35) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలలో అనుమానాస్పద స్థితిలో గురువారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. అతడు రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నంద్యాలలో అనుమానాస్పద స్థితిలో శరీరంపై గాయాలతో రైల్వేస్టేషన్ సమీపంలో పడి ఉండగా గుర్తించిన అక్కడి పోలీసులు నంద్యాల ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. అక్కడి పోలీసులు మహబూబాబాద్ జిల్లా కురవి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బంధువులు నంద్యాలకు బయల్దేరారు. మృతుడుకి భార్య విజయ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌పై చర్య తీసుకోవాలి

కొత్తగూడ, మే 29: ఆదివాసీ రైతుపై దాడిచేసిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌పై చర్య తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగబోయిన రవి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కొత్తగూడ రేంజర్‌కు వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ మండలంలోని ముస్మీ గ్రామానికి చెందిన ఆదివాసీ రైతు అయిలబోయిన కాంతారావును కొత్తగూడ రేంజ్ పరిధిలోని పోగుళ్లపల్లి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అల్లూనూరి రాజేశ్ సిబ్బందితో వచ్చి రేంజ్ ఆఫీస్‌కు తీసుకెళ్లి, చీకటి గదిలో బంధించి, అసభ్య పదజాలంతో దూషిస్తూ కొట్టడం జరిగిందని తెలిపారు. రాత్రి 11 గంటలకు వదిలిపెట్టారని, ఈఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అల్లూనూరి రాజేశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసి, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సువర్ణపాక వెంకటరత్నం, కుంజ నర్సింగరావు, చుంచ శ్రీను, బీరబోయిన చెన్నయ్య, ముస్మీ గ్రామ రైతులు కాంతారావు, ఐలబోయిన నరేష్, నర్సింగరావు, గట్టి రమేశ్, సురేష్, నాగేంద్రబాబు, పద్మ, లక్ష్మీ, శారద, సుశీల, మణెమ్మ పాల్గొన్నారు.



కొత్తగూడ రేంజర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

## బస్సుకింద పడి మహిళకు తీవ్రగాయాలు

వరంగల్ చౌరస్తా, మే 29 : కదులుతున్న బస్సులో నుంచి దిగుతుండగా కిందపడి ఓ మహిళ తీవ్రగాయాలపాలైన ఘటన వరంగల్ బస్టాండ్ ఆవరణలో గురువారం సాయంత్రం జరిగింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం చెరువుకొమ్ము తండాకు చెందిన జాటోత్ లక్ష్మి(60) భర్త వైద్య పరీక్షల కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు వచ్చింది. వైద్య పరీక్షల తర్వాత తిరిగి వెళ్లేందుకు ఇద్దరు వరంగల్ బస్టాండ్‌కు చేరుకున్నారు. ఆర్టీసీ బస్సు ఎక్కిన లక్ష్మి తన భర్త బస్సు ఎక్కకపోవడాన్ని గుర్తించి, కదిలే బస్సులో నుంచి దిగుతుండగా కింద పడింది. ఎడమకాలు పైనుంచి బస్సు వెనుక చక్రం పోయింది. కాలు నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. రైల్వేస్టేషన్‌లోని 108 సిబ్బంది చేరుకొని, ప్రథమ చికిత్స కోసం ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

మహబూబాబాద్ రూరల్, మే 29 : పట్టణంలోని డీవీ నాయక్ అకాడమీలో శిక్షణ పొందుతున్న కార్తీక్ విద్యుత్ షాక్‌తో బుధవారం అర్ధరాత్రి మృతిచెందగా మృతదేహాన్ని ఏరియా హాస్పిటల్ మార్చురీకి తరలించారు. గురువారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులకు మద్దతుగా డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు సూర్యప్రకాశ్ మాట్లాడుతూ డీవీ నాయక్ అకాడమీ నిర్వాహకులు నిర్లక్ష్యం వల్లే నిరుపేద విద్యార్థి విద్యుత్ షాక్‌తో మృతిచెందాడని ఆరోపించారు. తరుణ్, వినయ్, నరేష్, పవన్, గణేశ్, అజయ్, మోహన్ పాల్గొన్నారు.

## కుంగిన రైల్వే కల్వర్టు పరిశీలన

మహబూబాబాద్ రూరల్, మే 29 : కురుస్తున్న వర్షాలకు పట్టణ శివారులోని సిగ్నల్ కాలనీలో రైల్వేట్రాక్ పక్కనున్న కల్వర్టు కుంగిపోయింది. గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కల్వర్టు కుంగి స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదువుతున్నాయని, వాననీరంతా కాలనీకి వెళ్తోందని, మున్సిపల్, రైల్వే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. శంకర్, గోపీ, వీరేందర్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానం


ఇనుగుర్తి, మే 29: మండల కేంద్రంలో గాయత్రి గ్రూప్ ఆఫ్ కంపెనీ సహకారంతో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు జూన్ 3న రావాలని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు గురువారం ఆహ్వాన పత్రం అందజేశారు. స్థానిక పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌డేట్ చేసి, ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని పీఏసీఎస్ చైర్మన్ డీకొండ వెంకన్న వినతిపత్ర అందజేశారు. గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పప్పుల వెంకన్న, ఆ సంఘం కార్యదర్శి మహంకాళి సలీం, బేతమల్ల చంద్రయ్య, గుజ్జునూరి బాబురావు, గుజ్జునూరి వెంకన్న, బూర రజినీకాంత్, మల్లెపాక రమేశ్, నాగెల్లి సుధీర్ పాల్గొన్నారు.



వేం నరేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

## లారీ, గూడ్స్ ట్రాలీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

మరిపెడ, మే 29: లారీ, గూడ్స్ ట్రాలీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన గురువారం పట్టణ పరిధిలోని నేతావత్ తండా వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన రామకృష్ణ తన గూడ్స్ ట్రాలీ నడుపుకుంటూ తొర్రూరు వెళ్తుండగా వరంగల్ నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో గూడ్స్ ట్రాలీలో ఇరుక్కుపోయిన రామకృష్ణను 108 సిబ్బంది, స్థానికులు అతికష్టం మీద బయటకు తీశారు. చికిత్స కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



గాయపడిన రామకృష్ణ



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎన్యుమరేటర్లు (ఫైల్)

## ఏడు నెలలుగా ఎదురుచూపులే..

*ఇంకా అందని కుటుంబ సర్వే రెమ్యునరేషన్*

*156 మంది ఎన్యుమరేటర్లు, 62 మంది ఆపరేటర్లు*

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన కోసం సమగ్ర ఇంటింటా సర్వే నిర్వహించింది. సర్వేలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది, సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది సెలవు దినాల్లో కూడా సర్వే చేశారు. సర్వే పూర్తయి ఏడు నెలలు గడుస్తున్నా సర్వేలో పాల్గొన్న 156 మంది ఎన్యుమరేటర్లు, 62 మంది డేటా ఆపరేటర్లకు ఇప్పటివరకు రెమ్యునరేషన్ రాలేదు. సర్వే డబ్బుల కోసం మండల వ్యాప్తంగా 218 మంది ఎదురుచూస్తున్నారు.**

నెల్లికుదురు, మే 29: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో ప్రతి ఇంటి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమాచారాన్ని తెలుసుకునేలా నిర్దిష్ట ప్రొఫార్మను రూపొందించి సర్వే నిర్వహించారు. మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీల్లో సమగ్ర ఇంటింటా సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సీసీలు, సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బందితో సర్వే నిర్వహించారు. వీరందరికీ తొలుత మండల కేంద్రంలోని రైతువేదికలో నవంబర్ 4, 2024న సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నవంబర్ 6 2024 నుంచి మూడు రోజుల పాటు నవంబర్ 9 వరకు ముందుగా ఇంటింటికీ స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నవంబర్ 10 నుంచి 10 రోజుల పాటు ఒక్కో ఎన్యుమరేటర్లకు 80 నుంచి 120 ఇళ్లు సర్వే చేసేలా ప్రణాళికను సిద్ధం చేసి మండల వ్యాప్తంగా 15 వేల 600 ఇండ్లను సర్వే చేయడానికి 156 మంది ఎన్యుమరేటర్లను వినియోగించుకున్నారు. వీరందరూ సెలవుదినాల్లోనూ సర్వే నిర్వహించి సర్వే సమాచారం సేకరించారు. సర్వే ఫాంలను ఆన్‌లైన్ చేయడానికి ఒక్కో ఫాంకు రూ.30 చొప్పున మండల వ్యాప్తంగా 62 మంది డేటా ఆపరేటర్లను నియమించుకుని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆన్‌లైన్ ప్రక్రియను నిర్వహించి 10 రోజుల్లో ఆన్‌లైన ప్రక్రియను ముగించారు.

**ఏడు నెలలైనా..**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ముగిసి ఏడు నెలలు గడుస్తోంది. 80 నుంచి 120 కుటుంబాలను సర్వే చేసిన ఒక్కో ఎన్యుమరేటర్‌కు రూ.12వేలు చెల్లిస్తామని చెప్పి 156 మంది ఎన్యుమరేటర్లకు ఇప్పటివరకు చెల్లించలేదు. ఒక్కో సర్వేఫారం ఆన్‌లైన్ చేసినందుకు రూ.30 చెల్లిస్తామని 63 మంది డేటా ఆపరేటర్లను వినియోగించుకొని, వారికి నేటికీ డబ్బులు చెల్లించలేదు. డబ్బులు చెల్లిస్తామని ఎన్యూమరేటర్లు, డేటా ఆపరేటర్ల నుంచి ఇప్పటివరకు రెండు సార్లు బ్యాంకు ఖాతా వివరాలు సేకరించారు. కానీ ఇప్పటివరకు డబ్బులు మాత్రం వారి ఖాతాల్లో జమ చేయలేదు. సర్వే డబ్బులు చెల్లించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. ఇప్పటికైనా తక్షణమే ఎన్యూమరేటర్లకు, డేటా ఆపరేటర్లకు సర్వే డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు.

## వివాహిత అదృశ్యం

తొర్రూరు, మే 29: ఓ వివాహిత అదృశ్యమైనట్లు తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తి మండలం జగన్నాథపల్లికి చెందిన అన్నబోయిన రేణుక(34) కొన్ని నెలలుగా భర్త సుధాకర్‌తో గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె తండ్రి కనుకుంట్ల సోమయ్య తమ గ్రామమైన వేలికట్టెకు తీసుకొచ్చాడు. ఈనెల 25న మధ్యాహ్నం 12గంటల సమయంలో బయటికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఎంత వెతికినా జాడ లభించకపోవడంతో ఈనెల 29న సోమయ్య తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. రేణుక, సుధాకర్ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

## విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి

మహబూబాబాద్ రూరల్, మే 29 : విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలని రిటైర్డ్ ఎన్ఐటీ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఏకశిలా ఏంజెల్ పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో తార్కిక ఆలోచనపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు తమ ఆలోచన విధానానికి అనుగుణంగా సైన్స్‌పై మరింత అవగాహన పెంచాలన్నారు. జన విజ్ఞాన వేదిక ద్వారా మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నూతన అంశాలను జోడిస్తూ బోధించాలని సూచించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, ఆజాద్, అప్పారావు, శ్రీ రాములు పాల్గొన్నారు.

## విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, మే 29 : ఖరీఫ్‌కు రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల సమన్వయకర్త డాక్టర్ మాలతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వరిలో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక పంటకాలం ప్రకారం నారుమడులను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ తొలకరి వానలకు రైతులు నేలను దున్నుకోవాలని, వాణిజ్య పంటలు సాగుచేసే రైతులు జీలుగు, జనుము, పెసర, పిల్లి పెసర వంటి పంటలు వేసుకోవాలని సూచించారు.

## టీజేఎఫ్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

చిన్నగూడూరు/ గూడూరు, మే 29: ఈనెల 31న జరిగే తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం (టీజేఎఫ్) రజతోత్సవ సభను విజయవంతం చేయాలని టీజేఎఫ్ జిల్లా కో కన్వీనర్ గాడిపెల్లి శేఖర్ తెలిపారు. చిన్నగూడూరు తహసీల్ కార్యాలయం, గూడూరు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో టీజేఎఫ్ రతోత్సవాల పోస్టర్‌ను సంఘ నాయలకుతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డు జలవిహార్ ఆడిటోరియంలో ఈనెల 31న జరిగే సభకు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సంఘం నాయకులు కరుణాకర్, కాశయ్య, గందసిరి శ్రీపాల్, శ్రీనివాస్, విజయ్, గూడూరు ఎంపీడీవో వీరస్వామి, ఎస్కే యాకూబ్, జిమ్మిడి సంతోష్, రాజ్ కుమార్, గడ్డల శ్రీనివాస్, కమటం సంతోష్, మంగ మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చిన్నగూడూరు, మే 29: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మహబూబ్‌అలీతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నిలిచిన నీటిపై చల్లేందుకు బ్లీచింగ్ పౌడర్, టిమోపాస్, పెరిత్రిమ్, ఆయిల్‌బాల్స్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. కీటక జనిత వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ రామారావు, ఎంపీఓ రజినీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, వైద్య సిబ్బంది వలివుద్దిన్, రాధాకుమారి, సుమలత ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

## 108 వాహనం తనిఖీ

డోర్నకల్, మే 29: మండల కేంద్రంలోని 108 వాహనాన్ని జిల్లా ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ బత్తిని మహేశ్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అత్యవసర సమయంలో వినియోగిస్తున్న పరికరాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఈఎంటీ షమీనా, పైలెట్ సైదులుకు పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు, గర్భిణులు, పాముకాటు వంటి ఎమర్జెన్సీ సమయంలో 108 వాహనం సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.



తనిఖీ చేస్తున్న బత్తిని మహేశ్

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


గంగారం, మే 29: మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంత్రి సీతక్క గురువారం కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ ఈసం రమ, మాజీ ఎంపీపీ సరోజన, మాజీ వైస్ ఎంపీపీ వీనభద్ర, తహసీల్దార్ బాలకిషన్,ఎంపీడీవో అప్పారావు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న మంత్రి సీతక్క

## జీలుగ విత్తనాల ధరలు తగ్గించాలి

గూడూరు, మే 29: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందించే జీలుగ విత్తనాల ధరలు తగ్గించాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏవో అబ్దుల్ మాలిక్‌కు తన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ జీలుగ విత్తనాలు గతంలో 30 కిలోల బస్తాకు రూ.1,150 అందించగా, ఇప్పుడు రూ.2,137కు విక్రయిస్తున్నారని తెలిపారు. పంటలకు మద్దతు ధర రూ.60 నుంచి రూ.100 మాత్రమే పెంచుతుండగా, రైతులకు సబ్సిడీపై అందించే జీలుగ విత్తనాల ధరలు పెంచడం సరికాదన్నారు. నాయకులు బందెల వీరస్వామి, కే బుచ్చిరామయ్య, జీ సత్తయ్య పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు